ఉన్న ఊర్లోనే ఉపాధి

- కూలీల వలసలకు కళ్లెం
- రాప్తాడు మండలంలో 5.20 లక్షల పని దినాల కల్పన లక్ష్యం



హంపాపురం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాప్తాడు: ఉపాధి హామీ పథకం...కూలీల వలసలు నివారించి ఉన్న ఊరిలోనే జీవనోపాధి కల్పించే బృహత్తర పథకం..కూలీలకు వరంగా ఉన్న ఈ పథకాన్ని సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమర్థంతంగా అమలు చేస్తోంది. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడంతో పాటు వేతనాలను ఎప్పటికప్పుడు కూలీల ఖాతాలకు జమ చేస్తోంది. సొంతూరిలోనే పని దొరుకుతుండడంతో కూలీలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారు.

జోరందుకున్న ఉపాధి పనులు

రాప్తాడు మండలంలో ఉపాధి హామీ పథకం పనులు జోరందుకున్నాయి. వ్యవసాయ పనుల జోరు తగ్గి వేసవి ఆరంభం కావడంతో కూలీలు ఉపాధి పనుల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి మండలంలో 5 లక్షల 20 వేల పనిదినాలను కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలంలో 10,688 జాబ్‌కార్డులు ఉండగా ఇందులో మొత్తం 15771 మంది పనుల్లో పాల్గొంటున్నారు. 2023-24 సంవత్సరంలో వీరందరికి పని కల్పించడం ద్వారా రూ.10 కోట్లు వెచ్చించడానికి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా నీటి వనరులు, వాగులు, చెరువుల ఆధునికీకరణ, పంట పొలాల చుట్టూ సరిహద్దులు, అంతర్గతంగా కందకాలు, ఇంకుడు గుంతలు వంటి తవ్వకం పనులు చేపడతారు. జగనన్న పచ్చతోరణం పథకంలో భాగంగా రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాలు, చెరువు గట్లపైన మొక్కలు నాటే పనులు చేపడుతున్నారు. రైతుల పొలాల్లో ఉద్యాన, పండ్ల తోటల సాగును ప్రోత్సహించడానికి పనులు కేటాయిస్తారు. వంద రోజులు పని కల్పించి రోజుకు రూ.250 చొప్పున కూలీ సొమ్ము లభించేలా ప్రణాళికలు రూపొందించారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు



ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల వలసలను నివారించాలన్న ఉద్దేశంతో ఇప్పటికే అన్ని గ్రామాల్లో పనులను గుర్తించాం. గ్రామాల్లో అడిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నాం. ఏడాదికి కనీసం 100 రోజుల పని ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. పని చేసే చోట కూడా కొన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పాం. మండలంలో ఉన్న కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలి. పనుల్లో పారదర్శకత కోసం ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం.

–సాల్మన్, ఎంపీడీఓ, రాప్తాడు

- మండలంలో జాబ్ కార్డులు–10,688
- పనుల్లో పాల్గొంటున్న కూలీలు–15,771
- వెచ్చించనున్న నిధులు– రూ.10 కోట్లు

గాలికుంటు నివారణకు టీకా వేయించండి



పశువులకు వ్యాక్సినేషన్ వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఓడీ చెరువు: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ రైతులకు సూచించారు. ఆకుతోటపల్లి గ్రామంలో గురువారం ఆయన పశువులకు వ్యాక్సిన్ వేశారు. ఆయన మాట్లాడుతూ గాలికుంట వ్యాధి సోకిన పశువులకు 104 నుంచి 106 డిగ్రీల వరకు జ్వరం వస్తుందని, నోటికి, కాలిగిట్టలకు బొబ్బలు ఏర్పడి ఆహారం, నీరు తీసుకోలేక నీరసించిపోతాయన్నారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే పశువైద్యులతో చికిత్స చేయించాలన్నారు. పశువైద్యశాఖ అసిస్టెంట్లు పవన్, జ్యోత్స్న, గోపాలమిత్ర మూర్తి, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ సామగ్రి సరఫరా



ఇంటి నిర్మాణ సామగ్రి కిటికీలు, వాకిళ్లు పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు, లబ్ధిదారులు

కనగానపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు అందుబాటులో ఉంచినట్లు హౌసింగ్ ఏఈ చిరంజీవి తెలిపారు. స్థానిక హౌసింగ్ కార్యాలయానికి సరఫరా చేసిన ఇంటి నిర్మాణ సామగ్రిని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతున్న ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనుముతో పాటు కిటికీలు, వాకిళ్లను కూడా లబ్దిదారులకు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ షకీలా, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, హౌసింగ్ లబ్దిదారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: మద్యానికి డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఈఘటన జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు... లక్ష్మీచెన్నకేశవపురంలో సుబ్రహ్మణ్య, ఈశ్వరమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన సుబ్రహ్మణ్య... మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని కోరగా భార్య నిరాకరించింది. దీంతో అతను సూపర్‌వాస్మాల్ ద్రావకం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

కదిరి అర్బన్: కే.బ్రాహ్మణపల్లి, కొండమనాయునిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 51 మంది విద్యార్థులకు హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ గురువారం ప్యాడ్, జామెట్రిబాక్స్, పెన్ను, లాంగ్‌స్కేల్, పెన్సిల్ అందజేశారు. సంస్థ అధ్యక్షుడు రవినాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వారపు సంతకు నేడు వేలం

తలుపుల: కూరగాయల, సన్నజీవాల వారపు సంత నిర్వహణకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ మాధవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. లక్ష సాల్వెంట్ సర్టిఫికెట్, రూ.50వేల డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



తాగునీటి బోరు వేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని సున్నపుగుట్టతండాలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ శాంతాబాయ్ నూతన బోరు వేయించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్, ఎంపీటీసీ అల్లాబకాష్, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ వెంకటేశ్‌నాయక్, వార్డు మెంబర్ బాషా పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ..ఇద్దరికి గాయాలు



గాయపడిన నబీరసూల్

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని గంటాపురం క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు...ధర్మవరం పట్టణానికి చెందిన నబీరసూల్ బైక్‌పై వెళ్తూ జాతీయ రహదారి నుంచి గంటాపురం గ్రామానికి వెళ్లేందుకు క్రాస్ అయ్యాడు. ఇదే సమయంలో బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వైపు ఉన్న దాబా వద్దకు బైక్‌లో వెళ్తున్న ధర్మవరం పట్టణ నివాసి సాయి...నబీరసూల్ బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో నబీరసూల్ తలకు బలమైన గాయాలు కాగా సాయికి స్వల్పగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆర్డీటీ ఆస్పత్రికి తరలించినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.


పంటల నమోదు జాబితాను సరిచూసుకోండి



పంటల నమోదు జాబితాను చదివి వినిపిస్తున్న ఏఓ భారతి

నల్లచెరువు: అల్లుగుండులో ఏఓ భారతి ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రబీకి సంబంధించిన ఈక్రాప్ జాబితాను చదివి వినిపించారు. మండలంలోని 10 రైతు భరోసా కేంద్రాల్లో పంటల నమోదు జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. అభ్యంతరాలుంటే శుక్రవారం ఆర్‌బీకెల్లో సంప్రదించాలని సూచించారు. వీఏఏ నవీన్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నల్లమాడ: మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వంతకాళ్లపై నిలబడి ఆర్థిక పురోగతి సాధించాలని వక్తలు పిలుపునిచ్చారు. పెమనకుంటపల్లి తండా పంచాయతీ కేంద్రంలో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆర్డీటీ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన్‌మురళీ, సర్పంచ్ ఆనంద్‌నాయక్, ఎక్సైజ్ సీఐ మల్లిక పాల్గొని మాట్లాడారు. మహిళలు విద్యావంతులు కావాలని,మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలనూ చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు.

మూడు దశల్లోనే మొత్తం బిల్లుల చెల్లింపు



అమడగూరులో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ నాగరాజు

అమడగూరు: జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు చినగానిపల్లి, ఆకులవారిపల్లి, చినపానిపల్లి, మారుతీపురం, నరసన్నగారిపల్లి, బీ కొత్తపల్లి గ్రామాల్లోని జగనన్న లేఔట్లను గురువారం ఆయన సందర్శించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. బేస్‌మెంట్‌కు, మోల్డింగ్‌కు, చివరగా పూర్తి నిర్మాణానికి మూడు దశల్లోనే బిల్లు మొత్తం చెల్లిస్తున్నట్లు తెలిపారు. దశల వారీగా నిర్మాణాలు పూర్తయిన వెంటనే హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సంప్రదిస్తే వెంటనే బిల్లులు మంజూరు చేస్తారన్నారు. నిర్మాణ దశను బట్టి సిమెంట్‌ను కూడా ఒక్కో ఇంటికి 80 బస్తాలు ఇస్తున్నామన్నారు. హౌసింగ్ ఏఈ భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



కదిరి పట్టణం, కదిరి మండల కార్యవర్గ సభ్యులు

కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కార్యాలయంలో జిల్లా కార్యదర్శి చెన్నూర్ తాహిర్ వలీ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించి కదిరి పట్టణ, మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కదిరి పట్టణాధ్యక్షుడిగా మధుసూదన్, గౌరవాధ్యక్షుడిగా మైనోద్దీన్, సహాధ్యక్షులుగా కిష్టప్ప, గౌసియా, ప్రధాన కార్యదర్శిగా భార్గవ్, కోశాధికారిగా మహ్మద్ ఆసిఫ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా కదిరి మండల అధ్యక్షుడిగా నాగరాజు, గౌరవాధ్యక్షుడిగా మహ్మద్ హనీఫ్, సహాధ్యక్షులుగా వింధ్యారాణి, మహినూర్, ప్రధాన కార్యదర్శిగా మనోహర్, కోశాధికారిగా సునీల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

గాండ్లపెంట: యూటీఎఫ్ మండల శాఖ ఎన్నికను గురువారం ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా వైవి సుబ్బారెడ్డి, అధ్యక్షుడిగా ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా రమణానాయక్, జిల్లా కౌన్సిలర్‌గా మల్లికార్జున, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సాంబశివారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న మహిళా శక్తి సొసైటీ ప్రతినిధులు

కనగానపల్లి(రామగిరి): మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవాలని మహిళా శక్తి సొసైటీ అధ్యక్షురాలు వహీదా తెలిపారు. గురువారం రామగిరి మండలంలోని సుద్దకుంటపల్లిలో మహిళా శక్తి సొసైటీ ఆధ్వర్యంలో న్యాయసేవా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న హింస, బాల్య వివాహాల నిర్మూలనపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా శక్తి సొసైటీ కార్యనిర్వహణాధికారి కాంచన, టింబక్టు కలెక్టివ్ సంస్థ ప్రతినిధులు అశ్వని, సుకన్య, రమీజా, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

తలుపుల: పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన వేమలగొంది గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చెన్నక్రిష్ణ శుక్రవారం సాయంత్రం పొలంలో ఎద్దులను మేపుతుండగా గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈక్రమంలో పిడుగు పడటంతో ఎద్దు మృతి చెందింది. రూ.50వేల విలువైన ఎద్దు కళ్లెదుటే మృతి చెందడంతో అన్నదాత తీవ్ర వేదనకు గురయ్యాడు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

పుట్టపర్తి టౌన్: విజయవాడ అంబేడ్కర్ స్మృతివనంలో ఈనెల 24న జరిగే దళిత, గిరిజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఎమ్మార్పీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబుళేసు పిలుపునిచ్చారు. పుట్టపర్తి పట్టణం శిల్పారామంలో గురువారం ఆయన కరపత్రాలు విడుదల చేశారు. సమావేశం నిర్వహణకు సహకారం అందజేస్తున్న ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశానికి గిరిజనులు, దళితులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి, రాయలసీమ కన్వీనర్ వెంకటేష్, లక్ష్మినారాయణ, నరశింహులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో 10వ వార్డు గోకులంకు చెందిన సాయిలీల(48) అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందింది. వైఎస్సార్ సీపీ నాయకులు కవిత, శంకర్, శ్రీనివాసులు, సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి హరిచందన, అడ్మిన్ సెక్రటరీ సౌభాగ్యలక్ష్మి, వలంటీర్ హర్షవర్ధన్ గురువారం మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద రూ.10వేలు అందజేశారు.

జగనన్నను మరోమారు ఆశీర్వదించండి



పథకాలను వివరిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: రాష్ట్రాభివృద్ధికి, పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి గ్రామస్తులను కోరారు. గురువారం ఆయన మండల పరిధిలోని గాండ్లవారిపల్లి గ్రామంలో గుడ్‌మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సర్పంచ్ సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కిరణ్‌మోహన్‌రెడ్డి, సేవేనాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

నల్లమాడ: వ్యక్తిత్వ వికాసంపై మండలంలోని గ్రామ సచివాలయాల సిబ్బందికి స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో గురువారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీటీ డైరెక్టర్ శ్రీనివాసులు, శిక్షకులు శ్రీనివాసులు, ధనలక్ష్మి శిక్షణ ఇచ్చారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో ఎలా మెలగాలి, మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

తాడిమర్రి: రామాపురం గ్రామంలో సర్పంచ్ కుంటాల పుల్లయ్య ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆశా ఆసుపత్రి వైద్యులు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జీవీ సోమయాజులు, ప్రసాద్ తదితర వైద్య బృందం గ్రామస్తులకు కంటి పరీక్షలు, బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించారు. రోగులకు వైద్య చికిత్సలు అందించి, మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కె.నారాయణస్వామి, కె.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కొత్తచెరువు: కొత్తచెరువులోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 385 మందికిగాను 20 మంది, శివసాయి జూనియర్ కళాశాలలో 81 మందికి గాను 12 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

తాడిమర్రి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్రంలో ఇంటర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయి. గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. 37 మంది విద్యార్థులకుగాను ఒకరు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ డి.మధుసూదన్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారి బి.షెక్షావలి తెలిపారు.

నల్లమాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని గురువారం జిల్లా పరీక్షల కమిటీ సభ్యుడు రమణకుమార్, హైపవర్ కమిటీ సభ్యుడు షఫీ తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. గురువారం జరిగిన తెలుగు, హిందీ పరీక్షకు 174 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఆరు మంది గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంట్ అధికారి ప్రకాష్‌నాయుడు, పరీక్షల చీఫ్ కవిత తెలిపారు.

యువతి అదృశ్యం

ముదిగుబ్బ: పట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని చిరగారిపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ కుమార్తె అనూష అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. బంధువులు ఇళ్లు, ఆమె స్నేహితుల ఇళ్లలో గాలించినా అనూష ఆచూకీ కనిపించకపోవడంతో గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. యువతి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

పొట్టి శ్రీరాములు త్యాగం స్ఫూర్తిదాయకం



ధర్మవరం అర్బన్: పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



ధర్మవరం: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి



తాడిమర్రి: గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని సాధించి తెలుగు జాతికి గొప్ప కీర్తి తెచ్చారన్నారు.

- ఘనంగా జయంతి వేడుకలు



కనగానపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న అధికారులు

తాడిమర్రి: స్థానిక గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి గ్రంథాలయ అధికారి శీనా నాయక్ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు వదిలిన త్యాగశీలి పొట్టి శ్రీరాములు అని అన్నారు. పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు.

కదిరి టౌన్: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. టవర్‌క్లాక్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ధర్మవరం: పట్టణంలోని గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

ధర్మవరం అర్బన్: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కలవల రాంకుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు అన్నారు. పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా కోశాధికారి రేపాకుల సురేష్‌బాబు, జాయింట్ కార్యదర్శి గ్రంధే శ్రీనివాసులు, నాయకులు కృష్ణమూర్తి, ఓవీప్రసాద్, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు పాలమడ రూపారాగిణి, నల్లపేట మంజు, యువజన సంఘం నాయకులు అంబటి అవినాష్, అవోపా జిల్లా ఇన్‌చార్జ్ అన్నా లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు శీబా నగేష్‌గుప్త పాల్గొన్నారు.

గాండ్లపెంట: స్థానిక గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి ఫరియాబాను నివాళులర్పించారు. పాఠకులకు పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను, ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన త్యాగాలను తెలియజేశారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

కనగానపల్లి: ఆంధ్రప్రదేశ్ అవతరణకు పాటుబడిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు పలువురు ఘన నివాళులర్పించారు. గురువారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల గ్రంథాలయాధికారి గోవిందు, స్థానిక సొసైటీ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జయరాం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి పాఠకులతో కలసి నివాళులర్పించారు.



కదిరిటౌన్: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం